క్లుప్తంగా

నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



నరసాపురం: నరసాపురం మున్సిపల్ కమిషనర్‌గా కె.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. హిందూపురం మున్సిపాలిటీ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను మున్సిపల్ డీఈ రమేష్, మేనేజర్ నిర్మలాకుమారి, ఆర్ఐ నానాజీ తదితరుల కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని చెప్పారు. వేసవిలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెడతానని వివరించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే విధంగా కృషి చేస్తానన్నారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత



వెలివెల హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థికి స్కూల్ విద్యాభ్యాసంలో పదో తరగతి చివరి మజిలీ అని, ఎన్నో జ్ఞాపకాలతో పాఠశాలను వదిలి కళాశాల చదువులకు వెళతారని ప్రముఖ దాత గాదె సుబ్బారావు అన్నారు. వెలివెల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న 14 మంది విద్యార్థులకు పరీక్షల అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి అందజేసి వారిని అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు బి.శ్రీరామమూర్తి, సీహెచ్ లక్ష్మణరావు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శాంతకుమారి, ఎంపీటీసీ సూర్యప్రభ

యలమంచిలి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జగనన్న ప్రభుత్వంలో సొంతింటి కల తీరుతుందని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. మేడపాడులో ఇద్దరు లబ్ధిదారులకు ఇంటి స్థలం మంజూరు కాగా, వారికి ఇళ్ల పట్టాలను సోమవారం ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభతో కలసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామంలో సుమారు రెండెకరాల స్థలం కొనుగోలు చేసి 80 మందికి ఇళ్ల స్థలాలిచ్చామన్నారు. ఇంకా అర్హులుంటే వారికి కూడా పట్టాలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు డేగల వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి రవాణాతో అవస్థలు



యాళ్లవానిగరువు వద్ద రోడ్డుపై పడిన మట్టి

పాలకొల్లు అర్బన్: మండలంలో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పలు గ్రామాల్లో రాత్రి వేళ్లలో అనధికార లేఅవుట్లలో మెరక పనులు జోరుగా సాగుతున్నాయి. రాత్రి సమయంలో మట్టి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. ఈ సమయంలో ట్రాక్టర్ల నుంచి రోడ్డుపై మట్టి పెళ్లలు పడి వర్షం పడిన సందర్భాల్లో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి రవాణాలో నిబంధనలు పాటించకపోవడం వల్లనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలి

ఆకివీడు: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న రోజుల్లో కూడా ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి మద్దతు పలికారు. మండలంలోని చిన్నమిల్లిపాడు గ్రామంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జేసీఎస్ ఇన్‌చార్జి పుప్పాల పండు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఇంటికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. పథకాలు ప్రగతికి దోహదపడుతున్నాయని ప్రజలే చెబుతున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, నాడు–నేడు అభివృద్ధి పనులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ గురుదాస్ సీత బాలాజీ, పలువురు వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం



నరసాపురంలో మిషన్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ముందే చేరుకున్న విద్యార్థులు

నరసాపురం: నరసాపురంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం నుంచే విద్యార్థుల హడావిడి కనిపించింది. విద్యార్థులను తల్లిదండ్రులు వెంటపెట్టుకుని రావడం కనిపించింది. నరసాపురం పట్టణంలో 7, రూరల్‌లో 2, మొగల్తూరు మండలంలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నరసాపురం, మొగల్తూరు కలిపి మొత్తంగా 2,659 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. తొలిరోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా సాగిందని ఎంఈవో పుష్పరాజ్యం చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టినట్టు వివరించారు. అలాగే అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నరసాపురం మండలంలో 50 మంది గైర్హాజరు

నరసాపురం రూరల్: పది పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నరసాపురం మండలంలో 2, పట్టణంలో 7 పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నరసాపురం మండలంలో 1,778 మంది విద్యార్థులకు గాను 1,728 మంది హాజరయినట్లు మండల విద్యాశాఖాధికారి పిల్లి పుష్పరాజ్యం తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పది పరీక్షల విద్యార్థులు పరీక్ష రాసేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు. తొలి రోజు మొత్తం 50 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తుతో పాటు ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆరు కేంద్రాల్లో 866 మంది హాజరు

మొగల్తూరు: మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పదోతరగతి పరిక్షలకు 866 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖాధికారులు చెప్పారు. మండలంలోని కేపీపాలెం, శేరేపాలెం, జగన్నాథపురం, ముత్యాలపల్లి, మొగల్తూరు ఏ, బీ సెంటర్లకు సంబంధించి 881 మంది విద్యార్థులకు గాను 866 మంది హాజరయ్యారని, 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు.



మొగల్తూరులోని పరీక్షా కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



పాలకొల్లులోని ఓ కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పాలకొల్లులో 26 మంది గైర్హాజరు

పాలకొల్లు సెంట్రల్: పదో తరగతి పరీక్షలు సోమవారం పట్టణంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పాలకొల్లు పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాల్లో 1,919 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1,902 మంది హాజరయ్యారు. కాగా, 17 మంది గైర్హాజరయ్యారు.ఉదయం పోలీస్ స్టేషన్ నుంచి సెక్యూరిటీతో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను అందజేశారు. పరీక్ష ముగిసిన తరువాత జవాబు పత్రాలను పోస్టాఫీసుకు తరలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సదుపాయం కల్పించారు. బాలికలను సచివాలయ ఉమెన్ ప్రొటెక్షన్ మహిళలు తనిఖీలు చేశారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్షలకు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలు ఒకేలా ఉండటంతో తికమక..

రెండు పాఠశాలల పేర్లు దాదాపుగా ఒకేలా ఉండడంతో బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని బీఆర్ఎంవీ స్కూల్‌కు రావడంతో రూమ్‌లో కూర్చున్న తరువాత పరీక్ష కేంద్రం ఇక్కడ కాదని ఉపాధ్యాయులు చెప్పడంతో ఆ విద్యార్థిని కంగారుగా బయటకు పరుగులు తీసింది. వెంటనే బాలిక తండ్రి వేగంగా గరల్స్ హైస్కూల్‌కు ద్విచక్ర వాహనంపై తీసుకువెళ్లగా, 9.27 గంటలకు గరల్స్ హైస్కూల్‌కు సకాలంలో చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులు ముందుగా పలు ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకుని సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల పరీక్షలు అయ్యేవరకూ ఆయా పరీక్షా క్షేంద్రాల వద్దే వేచి ఉన్నారు.

3 కేంద్రాల్లో 575 మంది విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలంలోని శివదేవునిచిక్కాల, లంకలకోడేరు-1, లంకలకోడేరు-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మూడు కేంద్రాల్లోనూ 575 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

యలమంచిలిలో 665 మంది హాజరు

యలమంచిలి: మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 674 మంది విద్యార్థులకు గాను 665 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 9 మంది గైర్హాజరయ్యారు.

పోడూరులో 446 మంది హాజరు

పోడూరు: మండల వ్యాప్తంగా పోడూరు, జిన్నూరు, గుమ్ములూరు పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 454 మంది విద్యార్థులకు గాను 446 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎనిమిది మంది పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ ప్రేమజ్యోతి విలేకర్లకు తెలిపారు.

చెరుకువాడ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

పెనుగొండ: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి, చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.గురుమూర్తిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరూ అతిక్రమించరాదన్నారు. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, ప్రాథమిక చికిత్స ఏర్పాట్లు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పెనుగొండ, దేవ, సిద్ధాంతం కేంద్రాలనూ ఆకస్మిక పరిశీలన చేశారు. తెలుగు పరీక్షకు 1,033 మంది హాజరుకావలసి ఉండగా 19 మంది గైర్హాజరయ్యారు. ఆచంట మండలంలో 559 మంది హాజరు కావాల్సి ఉండగా నలుగురు గైర్హాజరయ్యారు.



పాలకొల్లులో పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు



హాల్‌టికెట్, రూమ్ నంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు



పెనుగొండ పరీక్ష కేంద్రంలో కేటాయించిన తరగతి గదిని తెలుసుకుంటున్న విద్యార్థులు



చెరుకువాడ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి

నేడు లక్ష్మణేశ్వరంలో వైఎస్సార్ ఆసరా

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మంగళవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎం పద్మ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి లక్ష్మణేశ్వరం-2 సచివాలయం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమంలో మండలంలోని లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద, సీతారామపురంసౌత్, నార్త్, రాజుగారితోట గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారన్నారు.

నేడు ఆచంట, ఆచంట వేమవరంలలో..

పెనుగొండ: ఆచంట మండలంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి చెప్పారు. విలేకర్లతో మాట్లాడుతూ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు ఆచంటలోని రామేశ్వరస్వామి సత్రంలో వల్లూరు, భీమలాపురం, అయోధ్యలంక, కరుగోరుమిల్లి, కందరవల్లి గ్రామాలకు చెందిన మహిళలకు, 11 గంటలకు ఆచంట వేమవరంలో ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాలకు చెందిన మహిళలకు నిర్వహిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రబీ మాసూళ్లు ప్రారంభం



శివదేవుని చిక్కాలలో దాళ్వా పంటను యంత్రం ద్వారా మాసూలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలో దాళ్వా పంట మాసూళ్లు ప్రారంభమయ్యాయి. నీటిపారుదల శాఖ అధికారులు వంతుల వారీ విధానం అమలు చేయడతో సాగునీటి ఎద్దడి సమస్య తలెత్తలేదు. ముందస్తు సాగు ఏర్పాట్లు చేసుకున్న రైతులు కొన్ని ప్రాంతాల్లో కోతలు ప్రారంభించారు. మండలంలోని శివదేవునిచిక్కాల, తిల్లపూడి, వెంకటాపురం, అరట్లకట్ట, పాలమూరు, గవరపేట తదితర గ్రామాల్లో మాసూళ్లు ప్రారంభించారు. వరికోత యంత్రం ద్వారా మాసూళ్లు చేసుకోవడంతో ట్రాక్టర్ల ద్వారా ధాన్యం వెంటనే గట్టుమీదకు చేరుస్తున్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 11,164 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేశారని ఏవో షేక్ అబ్దుల్ రహీం తెలిపారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 22 మంది ఎంపిక



స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన ముత్యాలపల్లి విద్యార్థులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఉన్నత పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)నకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బాలనాగమణి సోమవారం చెప్పారు. జిల్లా స్థాయిలో కె.కార్తీక్ ప్రథమ స్థానం, బి.సత్యచంద్ర శేఖర్ ద్వితీయ స్థానం, సీహెచ్ జిజ్ఞాస్ మూడో ర్యాంక్, టి.రాజేశ్వరి 7వ ర్యాంక్, ఆర్.లక్ష్మీ ప్రసన్న 8వ ర్యాంక్ సాధించారన్నారు. గత 11 ఏళ్లుగా సుమారు 159 మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను గ్రామ సర్పంచ్ కొపనాతి పల్లయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ కొల్లాటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని స్వామి, రేవు రాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



భగ్గేశ్వరంలో నల్లి రాజేష్‌ను సత్కరించిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఈ నెల 14వ తేదీన అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ కోరారు. భగ్గేశ్వరంలో మాలమహానాడు కార్యవర్గ విస్తరణ సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షుడు గుండె నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా దళితవాడలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితవాడల్లోని కమ్యూనిటీ హాళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాలమహానాడు కమిటీలోకి కొయ్యే లక్ష్మణరావును జిల్లా సహాయ కార్యదర్శిగా నియమించారు. మండల ఉపాధ్యక్షుడుగా కొయ్యే చంటిబాబు, మండల కార్యదర్శిగా కొయ్యే సూర్యారావు, మండల యువజన ఉపాధ్యక్షుడుగా సరెళ్ల రవికుమార్, నియోజక వర్గ సహాయ కార్యదర్శులుగా చింతా సుబ్బారావు, కొయ్యే ప్రసాద్‌బాబు, భగ్గేశ్వరం గ్రామ అధ్యక్షుడుగా బీర జయరాజు, ఉపాధ్యక్షుడుగా కొయ్యే నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శులుగా నేలపూడి వెంకట్రావు, కొయ్యే వెంకటేశ్వరరావులను నియమించారు. నల్లి రాజేష్‌ను గ్రామ పెద్దలు, మహిళలు శాలువాతో సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శులు కర్ణి జోగయ్య, మోకా నరసింహరావు, జిల్లా కోశాధికారి ఏనుగుపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

108 బిందెలతో మావూరమ్మకు అభిషేకం



బిందెలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారు వారి చెరువుగట్టున కొలువై ఉన్న శ్రీ మావూరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ముందుగా అమ్మవారికి 108 బిందెలతో అభిషేకం చేశారు. సోమవారం స్థానిక మహిళలు 108 పసుపు, కుంకుమ, గంధం, నీళ్ల బిందెలతో వార్డులో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు తెలిపారు. ఈ జాతర మహోత్సవాలు ఐదు రోజులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరావు శ్రీనివాసు, యందం శ్రీను, రౌతు అచ్యుతరావు, గమిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలూరులో ఛత్రపతి శివాజీ వర్ధంతి



పాఠశాలలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్

పోడూరు: గుమ్మలూరు మెయిన్ పాఠశాలలో సోమవారం ఛత్రపతి శివాజీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా హెచ్ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థులతో కలసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. దేశభక్తికి, దైవభక్తికి, ధైర్యానికి శివాజీ మారుపేరని, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించాడన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ మైలే శాంతకుమారి, పీఎంసీ సభ్యులు రావిపాటి మాణిక్యం, కొర్ర మణిదీపిక, పెనుగొండ భూలక్ష్మి, కంతేటి నాగమణి, కట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణం మార్పుతో రైతుల్లో గుబులు



మొగల్తూరులో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న కూలీలు



మొగల్తూరులో కోతకు సిద్ధమైన వరి పంట

మొగల్తూరు: వాతావరణం మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పది, ఇరవై రోజుల్లో పంటచేతి కొచ్చే దశలో తరుచూ వాతావరణంలో మార్పులతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని మొగల్తూరు, నవుదూరుగరువు, కేపీపాలెం, పేరుపాలెం, రామన్నపాలెం గ్రామాల్లో సుమారు 1,197 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టారు. సాగు పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో పంట చేతికిరావడం కూడా మరో ఇరవై రోజులు సమయం పట్టనుంది. మండలంలో ఎక్కువ శాతం రైతులు 130 రోజులకు పంట చేతికొచ్చే 1,153 రకం విత్తనాలు వినియోగించగా మరికొంత మంది రైతులు 140 రోజులకు పంట చేతికొచ్చే 1,121 రకం విత్తనాలను వినియోగించారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు, ఈదురుగాలులకు ఈనిక దశలో ఉన్న చేలు నేల రాలగా ఆందోళనకు గురయ్యారు. పంట చేతికొస్తుందని ఊపిరిపోసుకుంటున్న దశలో మరోసారి గత మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మరోవైపు మామిడి రైతుల పరిస్థితి కూడా ఆయోమయంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి చేతికొచ్చే రకం కాయలు దిగుబడి లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. భారీ వర్షం లేదా ఈదురుగాలులు వీచినా ఉన్న కాయలు కూడా నేలరాలిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం




సరిపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని త్రైత సిద్ధాంత భగవద్గీత చదవడం ద్వారా తెలుసుకోగలుగుతారని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడికుదురు కమిటీ అధ్యక్షులు బండారు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులతో కలసి ఆయన నిర్వహించారు. త్రిమత ఏకైక గురువు శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవజ్ఞాన ప్రచారంలో భాగంగా గ్రామస్తులకు గీతా ప్రతులను, ఇతర నీతి, ఆధ్యాత్మిక గ్రంథాలను విక్రయించారు. ప్రబోధసేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, అభిమన్యురాజు, విశ్వనాథ్, ప్రసన్న, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో అపార అవకాశాలు

సాక్షి, భీమవరం: ఏఐ, ఫార్మా రంగాల్లో అపార అవకాశాలున్నాయని కేఆర్ కన్సల్టెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేఆర్ ప్రసాద్ అన్నారు. భీమవరం విష్ణు ఫార్మసీ కళాశాలలో ‘రోల్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్’ అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. నాందేడ్ ఇందిరా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కటకం ప్రకాష్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఫార్మా రంగంలో మార్పులను వివరించారు. విష్ణు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ నటరాజ్, డాక్టర్ కృష్ణ, విష్ణు క్యాంపస్ ఏడీ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

శ్రీరామ నామస్మరణతో మార్మోగిన బొండాడ



రథంపై ఊరేగుతున్న స్వామివారు

కాళ్ల: శ్రీరామ నామస్మరణతో బొండాడ గ్రామం మార్మోగింది. గ్రామంలో భద్రాద్రి శ్రీరామచంద్రస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఊరేగింపు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లను వివిధ మేళతాళాలతో, చిత్ర విచిత్ర వేషధారణతో, బాణసంచా కాల్పుల నడుమ భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు కన్నుల పండుగగా జరిగింది. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు రోడ్లపై బారులు తీరారు. వైఎస్సార్సీపీ నాయకులు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో విష్ణు విద్యార్థుల ప్రతిభ

సాక్షి, భీమవరం: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈనెల 1న ప్రకాశం జిల్లా ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని వినతి



పెనుగొండలో వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుగొండ: పెనుగొండ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పెనుగొండ మండల తహసీల్దారు, ఎంపీడీవోలకు వినతిపత్రం సమర్పించారు. గత రెండేళ్లుగా కార్మికులకు వేతనం పెంచడం లేదని వివరించారు. వేతనం పెంచడం ద్వారా కార్మికులకు ప్రయోజనం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు మాదాసు నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.